# వ్యవసాయ మద్దతు ధరల విధానం

## వ్యవసాయ ఉత్పత్తుల ధరల విధానం – మద్దతు, సేకరణ

వ్యవసాయరంగ ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడంలో రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వమే నేరుగా జోక్యం చేసుకొని కొన్ని రకాల ఉత్పత్తులకు కనీస ధరలు నిర్ణయించే విధానాన్ని అమలు చేస్తోంది.

### లక్ష్యాలు:

- వ్యవసాయ ఉత్పత్తులకు తగిన ధరలు లభించేలా చేసి, వ్యవసాయ రంగంలో పెట్టుబడులు, ఉత్పత్తులను ప్రోత్సాహించడం. అదే సమయంలో వినియోగదారులకు వ్యవసాయ ఉత్పత్తులు సహేతుకమైన ధరలకు లభ్యమయ్యేలా చూడడం.
- మద్దతు ధరను నిర్ణయించడానికి ముందు ఆయా రకాల వ్యవసాయ ఉత్పత్తులను ఇంకా ఎంత అధికం చేయాలో నిర్ధారించడం
- ఎగుమతి అవసరాలు దృష్టిలో ఉంచుకొని ధరలు నిర్ణయించడం
- పంట వేయడానికి ముందే మద్దతు ధరలు ప్రకటించడం
- ప్రభుత్వ ధరల విధానాన్ని అమలు చేయడానికి కావాల్సిన సౌకర్యాలు ఏర్పాటు చేయడం

1986 నవంబరులో భారత ప్రభుత్వం నూతన వ్యవసాయధరల విధానాన్ని ప్రకటించింది. పప్పుదినుసులు, చెరకు, ఇతర ఆహార ధాన్యాల ఉత్పత్తులను అధికం చేయడానికి మద్దతు ధరల విధానాన్ని మెరుగుపరచాలని నిర్ణయించారు. నాటి సహకార ప్రణాళిక కమిటీ అధ్యక్షుడు ఆర్‌జి. సరియా, వ్యవసాయదారుల ఉపసంఘం అధ్యక్షుడు వి.టి.కృష్ణమాచారి 1947లో వ్యవసాయ ఉత్పత్తులకు సముచిత ధరలు లభించే విధంగా ప్రభుత్వం జోక్యం చేసుకొని కనిష్ట ధరలు నిర్ణయించాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తులకు రుతుసంబంధమైన, చక్రీయ అస్థిరత్వాలను దృష్టిలో పెట్టుకొని ఇతర వినియోగ వస్తువుల్లా ధరల నిర్ణయాన్ని మార్కెట్ గిరాకీ – సరఫరా విషయాలకు వదిలేయకూడదని కూడా సలహా ఇచ్చారు.

### ప్రభుత్వ నియంత్రణలో ధరలు ముఖ్యంగా 3 రకాలు:

1. కనీస మద్దతు ధర (Minimum Support Price) 2. సేకరణ ధర (Procurement Price) 3. జారీ ధర (Issue Price)

**1) కనీస మద్దతు ధర:** మార్కెట్‌లో ఆహారధాన్యాలు ఆర్థికమాంద్యం లేదా అధికోత్పత్తుల వల్ల రైతులకు సరైన ధరలు లభించని స్థితిలో ప్రభుత్వం మార్కెట్ ధరల ప్రకారం లేదా అంతకంటే ఎక్కువ ధర చెల్లించి రైతుకు కనీస లాభం సమకూర్చడానికి దోహదపడే ప్రక్రియనే కనీస మద్దతు ధరల విధానం అంటారు. వ్యవసాయదారులు ఎంతో వ్యయప్రయాసలతో పండించిన ఉత్పత్తుల అమ్మకాల్లో నష్టపోరాదనేది ప్రభుత్వ అభిమతం. ఆంధ్రప్రదేశ్‌లోని స్త్రీ స్వయం సహాయక గ్రూపులు, రైతుమిత్రా గ్రూపుల ద్వారా గ్రామ స్థాయిలో వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసే అవకాశాన్ని రాష్ట్రప్రభుత్వం కల్పించింది. ఏడు రకాలైన కాయధాన్యాలు.. వరి, జొన్న, గోధుమ, సజ్జలు, మొక్కజొన్నలు, బార్లీ, రాగి అలాగే కొన్ని పప్పుధాన్యాలు, నూనెగింజలు, చెరకు, పత్తి, జనుము, పొగాకు పంటలకు కనీస ధరలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది.

**CACP (కమిషన్ ఫర్ అగ్రికల్చర్ కాస్ట్ – ప్రైస్):** వ్యవసాయ ఉత్పత్తులకు ప్రతి సంవత్సరం ప్రకటించే కనీస మద్దతు ధర కోసం CACP వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రకటిస్తుంది. అవి: 1) ఉత్పాదన వ్యయం 2) ఉత్పత్తి కారకాల ధరల్లో మార్పులు 3) డిమాండు సప్లైల పరిస్థితి 4) మార్కెట్ ధరల్లో హెచ్చు తగ్గులు 5) అంతర్జాతీయ మార్కెట్లలో ధరల పరిస్థితి మొదలైనవి. సి.ఎ.సి.పి నిర్ణయించిన ధరను చట్టబద్ధమైన ధర అంటారు. ఈ కమిషన్ చేసిన ప్రతిపాదనలను అనుసరించి ప్రభుత్వం వివిధ పంటలకు ధరలు నిర్ణయిస్తుంది.

**2) పంట సేకరణ ధర:** రైతుల వద్ద నుంచి వ్యవసాయ ఉత్పత్తులను ఎఫ్.సి.ఐ. సేకరిస్తుంది. ఈ ప్రక్రియ నేరుగా కాకుండా రైసు మిల్లర్ల ద్వారా సమీకరిస్తుంది. రైసు మిల్లర్లు గ్రామాలకు వెళ్లి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరను చెల్లించి స్టాకులను తరలిస్తారు. సమీకరణ, తరలింపుల ప్రొక్యూర్‌మెంట్ ప్రక్రియకు మిల్లర్లకు అయ్యే అదనపు ఖర్చులను ప్రభుత్వమే భరించి కనీస మద్దతు ధరతో సహా చెల్లిస్తుంది. దీన్నే ప్రొక్యూర్‌మెంట్ ధర అంటారు.

**3) జారీ ధర:** కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల డిమాండును బట్టి ఆహార ధాన్యాలు అమ్మే ధరను జారీ ధర అంటారు. జారీధర కంటే తక్కువ ధరకు కూడా రాష్ట్ర ప్రభుత్వాలు ఆహార ధాన్యాలను ప్రజలకందించవచ్చు.

**రాష్ట్ర ప్రభుత్వ సలహాధర:** కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కనీస మద్దతు ధర కంటే ఎక్కువ ధరను రైతులకు చెల్లించి ఆదుకుంటే దాన్ని సలహాధర (State Advice Price) అంటారు. చెరుకు రైతులను ఆదుకోవడానికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఈ విధానం అనుసరిస్తోంది.

2008–09 నాటికి CACP 24 ముఖ్య పంటలకు కనీస మద్దతు ధరల కోసం సిఫారసు చేసింది.

2007–08 ఎం.ఎస్.పి.తో పోలిస్తే 2008–09లో ధాన్యానికి మద్దతు ధర రూ.205, జావర్, బాజ్రాలు రూ.240, మేజ్ రూ.220, రాగులు రూ.315 క్వింటాల్‌కు పెంచారు. 2009 ఆగస్టులో కేంద్ర క్యాబినెట్ ఎకనమిక్ వ్యవహారాల కమిటీ ధాన్యం ఎం.ఎస్.పి. రూ.1000, పప్పుదినుసుల్లో అర్హార్ రూ.2300, అదే విధంగా మూంగ్ వెరైటీ రూ.2750కు పెంచింది.

ఆంధ్రప్రదేశ్‌లో మద్దతు ధరల కింద 2007–08లో 5.57 లక్షల మెట్రిక్ టన్నులు, 2008–09లో (2009 జూన్ నాటికి) 11.26 లక్షల

SAKSHI

మెట్రిక్ టన్నుల ధాన్యం; మేజ్‌కు సంబంధించి 2007-08లో 0.61, 2008-09లో 1.77 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించారు.

### మద్దతు ధరల స్కీం (Price Support Scheme), ప్రొక్యూర్‌మెంట్ అమలుచేస్తున్న ప్రముఖ సంస్థలు:

**గోధుమలు, ధాన్యం:** డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫుడ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్, కాటన్ – నాఫెడ్, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా.

**ఆయిల్ సీడ్స్, పల్సెస్ సేకరణ కోసం:** డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ కోఆపరేషన్.

మార్కెట్ ఇంటర్‌వెన్షన్ (MIS) స్కీంను ఆయా రాష్ట్ర ప్రభుత్వాల కోరిక మేరకు ఎక్కువగా నిల్వ ఉంచడానికి అవకాశం లేని, మద్దతు ధరల కిందకు రాని వ్యవసాయ ఉత్పత్తులు కూడా డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ ద్వారా అమలు చేస్తున్నారు.

ఎం.ఎస్.పి కంటే ధరలు పడిపోయినప్పుడు, ప్రైస్ సపోర్టు స్కీం (PSS) కింద ఆయిల్ సీడ్స్, పల్సెస్, కాటన్ ఉత్పత్తుల సేకరణ నాఫెడ్ పర్యవేక్షిస్తుంది. మార్కెట్ నియంత్రణా విధానం కింద నిత్యావసర వస్తువుల ధరలు విపరీత స్థాయిలో పెరిగినప్పుడు ప్రభుత్వ శాఖలైన సివిల్ సప్లైస్ కార్పొరేషన్, గిరిజన్ కార్పొరేషన్, రైతుబజార్, నాఫెడ్ వ్యవస్థల ద్వారా నిర్ణీత ధరలకు ప్రజలకు ఆయా వస్తువులను అందించే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుంది. ఈ విధమైన ప్రక్రియ ద్వారా ఆహార సంబంధిత ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడానికి ప్రయత్నిస్తున్నారు.

### స్వామినాథన్ కమిషన్ సిఫారసులు:

రైతుల ఆర్థిక శ్రేయస్సును కాంక్షిస్తూ ఎం.ఎస్. స్వామినాథన్ కమిషన్ కేంద్రప్రభుత్వానికి 2006లో సమర్పించిన నివేదికలో పేర్కొన్న అంశాలు..

- కొన్ని రకాల పంటలైన వరి, మొక్కజొన్న, సజ్జ, రాగి మొదలైన వాటికయ్యే ఉత్పత్తి ఖర్చు కన్నా కనీస మద్దతు ధర తక్కువగా ఉంటోంది.
- ఆయిల్ సీడ్స్ ఉత్పత్తుల్లో మన రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉన్నప్పటికి, వేరుశనగ ఉత్పత్తులు బాగా తగ్గిపోతూ ఉండడం ఆందోళన కలిగిస్తున్న సమస్య. దీని కోసం ఈ పంటలకు ఎక్కువ మద్దతు ధరలు ప్రకటించాలని కమిషన్ సూచించింది.
- కనీస మద్దతు ధరను పంట సాగుకు ముందే ప్రకటించడం.
- చిన్న, సన్నకారు రైతుల్లో వ్యవసాయ ఉత్పత్తులు ఎక్కువగా కొనసాగించే ఆసక్తిని కాపాడే విధంగా ప్రోత్సాహక చర్యలు చేపట్టడం.
- రైతుల ఆత్మహత్యలను నిరోధించే దిశలో వారికి కావాల్సిన మార్కెట్ సదుపాయాలు, రుణ సదుపాయం, సాంకేతిక పరిజ్ఞానం, పునరావాసం మొదలైనవి మూడు దశల్లో సమకూర్చడం.
- రుణాలు, దళారీలు వసూలు చేసే అధిక వడ్డీలపై ప్రత్యేక దృష్టి పెట్టడం.
- రైతులకు ఆరోగ్య భీమా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పటిష్టపరచడం, మహిళా రైతులకు ప్రోత్సాహం.
- రైతులకు రాష్ట్ర స్థాయి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు
- గ్రామ పంచాయతీలను 'జలస్వరాజ్'లుగా అభివృద్ధి చేసి, నీటి పంపిణీలో అసమానతలు నివారించడం.
- ప్రభుత్వ జోక్యాన్ని అధికం చేసి ఇప్పటికే ఏర్పాటు చేసిన రైతుబజార్లు, మార్కెట్ యార్డ్ వ్యవస్థను పటిష్టపరచడం.
- రైతులు ఉపయోగించే విత్తనాలు, రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందుల ధరలు, నాణ్యత విషయంలో పర్యవేక్షణ.
- ప్రజాపంపిణీ వ్యవస్థలో పంపిణీకి ఇతర ఆహార పంటలైన రాగి, సజ్జ, జొన్న మొదలైన వాటిని చేర్చడం.
- పంట మార్పిడి ప్రయోగాలు ప్రభుత్వ వ్యవసాయ క్షేత్రాల్లో జరిపి వాటి ఫలితాలు చూసిన తర్వాత మాత్రమే చిన్న కారు రైతుల భూముల్లో అమలు చేయడం.
- ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటుచేసి వ్యవసాయ ఉత్పత్తుల ధరల్లో వచ్చే మార్పుల నుంచి రైతులను రక్షించడం లాంటి అనేక అంశాలున్నాయి.

## మాదిరి ప్రశ్నలు

**1. రైతు సంక్షేమానికి సంబంధించి కింది వాటిలో అతి ముఖ్యమైంది?**

ఎ) రైతులకు ఉచిత విత్తనాల పంపిణీ

బి) ఎం.ఎస్.స్వామినాథన్ అధ్యక్షతన జాతీయ రైతు సంక్షేమ కమిషన్ ఏర్పాటు

సి) వ్యవసాయ ధరల విధానం

డి) ఎ, సి

**2. 1947లో వి.టి.కృష్ణమాచారి వ్యవసాయ ధరల సబ్ కమిటీ కింది వాటిలో దేన్ని సూచించింది?**

ఎ) వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు ప్రకటించాలని సూచన చేయడం

బి) సబ్సిడీలు ప్రకటించడం

సి) తక్కువ ధరలకు ఎరువులు సరఫరా చేయడం

డి) ఎ, బి

**3. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర నిర్ణయించేది?**

ఎ) నాఫెడ్ బి) మార్క్‌ఫెడ్

సి) వ్యవసాయ ధరల కమిషన్ డి) ఎఫ్.సి.ఐ.

**4. 2009-10లో పెంచిన ధాన్యం మద్దతు ధర (రూపాయల్లో)?**

ఎ) 850 బి) 920 సి) 1000 డి) 1200

**5. వ్యవసాయ ధరల కమిషన్ ఏర్పాటు చేయాలని సూచించిన కమిటీ?**

ఎ) ఎల్.కె.ఝా కమిటీ- 1965 బి) గుప్తా కమిటీ -1970

సి) అహ్లూవాలియా కమిటీ- 1980

డి) సర్కారియా కమిటీ -1967

**6. రైతులు పంట వేయడానికి ముందే రాబడి హామీని కల్పిస్తూ ప్రకటించే ధర?**

ఎ) జారీ ధర బి) సేకరణ ధర

SAKSHI

సి) సలహా ధర డి) కనీస మద్దతు ధర

7. మహిళా స్వయం సహాయక బృందాల ద్వారా ఉత్పత్తులు కొనుగోలు చేసి సేకరించే ప్రక్రియ చేపట్టిన మొదటి రాష్ట్రం?

ఎ) ఒరిస్సా బి) కర్ణాటక
సి) ఆంధ్రప్రదేశ్ డి) మధ్యప్రదేశ్

8. మద్దతు ధరను ప్రస్తుతం ఎన్ని పంటలకు ప్రభుత్వం అమలు చేస్తోంది?

ఎ) 20 బి) 15 సి) 24 డి) 30

**సమాధానాలు**

| | | | |
|---|---|---|---|
| 1 బి | 2 ఎ | 3 సి | 4 సి |
| 5 ఎ | 6 డి | 7 సి | 8 సి |

SAKSHI